


- నినాదాల నుంచి నిజమైన ఆచరణ వైపు.
- 2047 నాటికి విశ్వగురువుగా భారత్:.
- అట్టడుగు వర్గాల అభ్యున్నతే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం.
- రైతన్నకు రక్ష.. దేశానికి శ్రీరామరక్ష.
- మాజీ ఎమ్మెల్సీ ఎండల లక్ష్మీనారాయణ.
- ఖమ్మం సంకల్ప సమ్మేళనంలో దార్శనిక ప్రసంగాలు
- ఖమ్మంలో బీజేపీ సమావేశంలో పలువురి మేధావుల హాజరు

వపం నాగయ్య, కెరటం న్యూస్

ఒకప్పుడు దస్త్రాలకు, నినాదాలకే పరిమితమైన ప్రజా సంక్షేమం.. గత పన్నెండేళ్ల పాలనలో నిజమైన ఆచరణకు నోచుకుందని, 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా ప్రభుత్వ 'వికసిత భారత్' బృహత్తర సంకల్పం తీసుకుందని మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నాయకులు ఎండల లక్ష్మీనారాయణ ఉద్ఘాటించారు. ఖమ్మం నగరంలో శనివారం నగరంలోని ప్రముఖ కావేరి రిసార్ట్స్ వేదికగా "12 సంవత్సరాల వికాసం, ప్రజా సంక్షేమం.. వికసిత భారత్ సంకల్ప సమ్మేళనం" బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మక సమ్మేళనా నికి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ఎండల లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. దేశ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా మౌలిక సదుపాయాల కల్పన, రైతుల ఆదాయ పెంపు నుంచి మహిళా సాధికారత వరకు కనీవినీ ఎరుగని రీతిలో సాధించిన ఈ సువర్ణ ప్రగతిని ప్రతి పేదవాడి గడపకు చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తల భుజస్కంధాలపైనే ఉందని ఆయన అన్నారు. ఈ పన్నెండేళ్ల కాలం దేశ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందని అభివర్ణించారు. సాహసోపేతమైన నిర్ణయాలు, పారదర్శక పాలన కారణంగా భారతదేశం నేడు ప్రపంచ దేశాల ముందు సగర్వంగా తలెత్తుకుని నిలబడిందని ఆయన గర్వంగా చెప్పారు. కోట్లాది మంది భారతీయుల ఆకాంక్షలకు ప్రతిరూపమైన 'వికసిత భారత్' కలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపు నిచ్చారు. సరిగ్గా ఇదే వేదికపై వ్యవసాయ రంగంలో కేంద్రం తీసుకొచ్చిన సమూల మార్పుల గురించి పలువురు వక్తలు గణాంకాలతో సహా సవివరంగా ప్రజల ముందుంచారు. 2013-14 నాటి పరిస్థి తులతో పోలిస్తే నేడు పంటల కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పీ) రికార్డు స్థాయిలో పెరిగా యని సభలో స్పష్టం చేశారు. ఒకప్పు డు రూ.1,310 ఉన్న సాధారణ రకం వరి ధర ఇప్పుడు రూ.2,441కి చేరిందని, ఏ-గ్రేడ్ వరి ధర రూ.1,345 నుంచి రూ.2,461కి, జొన్నల ధర రూ.1,500 నుంచి ఏకంగా రూ.3,69 9కి పెరగడం వ్యవసాయ రంగానికి కేంద్రం ఇస్తున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తోందని వారు విశ్లేషించారు. వాణిజ్య పంటలైన పత్తి (షార్ట్ స్టెపుల్) ధర రూ.3,7 00 నుంచి రూ.8,268కి, పప్పు దినుసు లైన పెసలు, మినుములు, కందుల ధరలు సైతం ఊహించని రీతిలో వృద్ధి చెందడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. మద్దతు ధరల పెంపుతో పాటుగా రైతుల పెట్టుబడి భారాన్ని తగ్గించేందుకు కేంద్రం తీసుకుంటున్న చారిత్రక నిర్ణయాలను నాయకులు కొనియాడారు. దళారీ వ్యవస్థ ను పూర్తిగా పారద్రోలుతూ, 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా నేరుగా రైతుల ఖాతా ల్లోకే ఆర్థిక సాయాన్ని జమ చేస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయంగా యుద్ధాలు, ఇతర ఉద్రిక్త పరిస్థితుల వల్ల ద్రవ్యోల్బణం భయపెడుతున్నా, దేశంలో యూరియా బస్తా ధరను కేవలం రూ.266 .50 వద్దే స్థిరంగా ఉంచగలి గామని గుర్తుచేశారు. అలాగే 50 కిలోల డీఏపీ బస్తాపై రూ.1,6 65 మేర సబ్సిడీని కేంద్రమే భరిస్తోందని, ప్రభుత్వ జోక్యం లేకపోతే మార్కెట్లో దీని ధర రూ.4,000 దాటిపోయి రైతుల నడ్డి విరిచేదని ఆందోళన వ్యక్తం చేశారు. పటిష్టమైన విదేశీ విధానం, ముందుచూపు తో కూడిన ప్రణాళికల ద్వారానే దేశంలో ఎరువుల కొరత లేకుండా సరఫరా వ్యవస్థ ను కాపాడుకోగలిగామని వక్తలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు సన్నీ ఉదయ ప్రతాప్, సీనియర్ నాయకులు వక్కలంక సుబ్రహ్మణ్యం, విజయ రాజు, గుప్తా తదితన బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

